క్లుప్తంగా

23 మందికి ఉద్యోగాలు



మచిలీపట్నంటౌన్: జిల్లా ఉపాధి కల్పన శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. 67 మంది హాజరుకాగా వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి 23 మందిని పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి డి. విక్టర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విక్టర్‌బాబును పలువురు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్ పాల్గొన్నారు.

ఆర్సీ కరకట్టపై నివాసాల పరిశీలన



మోపిదేవి: మోపిదేవి పాత ఆర్సీ కరకట్టపై నివాసాలను మచిలీపట్నం ఆర్డీఓ బీఎస్ నారాయణరెడ్డి బుధవారం పరిశీలించారు. దశాబ్దాల నుంచి కరకట్టపై నివాసం ఉంటున్న లబ్ధిదారులు పట్టాల సమస్యను అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పాత కరకట్ట ప్రదేశం వాస్తవ పరిస్థితిని పరిశీలించి రెవెన్యూ అధికారుల నుంచి వివరాలు సేకరించామని ఆర్డీఓ తెలిపారు. సుమారు 3.68 ఎకరాల్లో ఇళ్లు వేసుకున్నట్లు గుర్తించామన్నారు. పూర్తి వివరాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఆర్ఐ సునీల్, మండల సర్వేయర్‌ర రామకృష్ణబాబు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



మచిలీపట్నం టౌన్: ఈడేపల్లి వృద్ధాశ్రమంలో తలదాచుకుంటున్న వృద్ధులకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) గురువారం చీరలు, టవల్స్ పంపిణీ చేశారు. దసరా సందర్భంగా కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి వృద్ధులకు వీటిని అందించేందుకు తీసుకువచ్చి పేర్ని కిట్టు చేతుల మీదుగా అందజేశారు. కార్పొరేటర్లు భోగాది సాయిబాబు, పల్లి శేఖర్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు షేక్ జలీల్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయండి

మోపిదేవి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వేను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను మచిలీపట్నం ఆర్డీఓ బీఎస్ నారాయణరెడ్డి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో మండల, గ్రామ సర్వేయర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. రైతులకు ఎంతో మేలు చేకూర్చే రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటి వరకు జరిగిన సర్వే వివరాలను గ్రామాల వారీగా సర్వేయర్‌లను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఆర్ఐ సునీల్, మండల సర్వేయర్ రామకృష్ణబాబు, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పెడన: ప్రాధాన్యతా క్రమంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. పెనుమల్లి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎంపీపీ రాజులపాటి వాణితో కలిసి శంకుస్థాపన చేశారు. రాజీవ్ మాట్లాడుతూ ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పూర్తిచేసిన సందర్భంగా విడుదలైన ఎన్ఆర్ఈజీఎస్ గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.18 లక్షలతో నూతనంగా సీసీ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. సర్పంచ్ గరికపాటి వెంకట రామానాయుడు, పెడన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చారుమతి, మాజీ ఎంపీపీ అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, దావు బైరవలింగం, మాత వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

మేరీ మిట్టీ మేరా దేశ్ కలశ యాత్ర

కోనేరుసెంటర్: క్రీడా యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం విజయవాడ వారి ఆధ్వర్యంలో బుధవారం వాడపాలెం గ్రామ సచివాలయంలో మేరీ మిట్టీ మేరా దేశ్ కలశ యాత్ర నిర్వహించారు. ఎంపీడీఓ బాలకృష్ణారావు మాట్లాడుతూ కార్యక్రమ ప్రాధాన్యతను వివరించారు. వాడపాలెం, కేపీటీపాలెం సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ.. నమోస్తుతే

- భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రి వేడుకలు
- మహాలక్ష్మీ, వివిధ రూపాల్లో అమ్మవార్ల దర్శనం
- ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు

పెడన: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల్లోని ఆలయాలు, ప్రధాన కూడళ్లలో అమ్మవార్లు మహాలక్ష్మిగాను, వివిధ రూపాల్లోనూ భక్తులకు దర్శనమిచ్చారు. పెడన పైడమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. చిల్లిముంత చిరంజీవి, నాగజ్యోతి దంపతులచే పూజాదికాలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రూ.20 లక్షల నగదుతో అమ్మవారిని అలంకరించారు. మహాలక్ష్మీదేవి హోమం, సామూహిక కుంకుమార్చనలు, సాయంత్రం లలితా పారాయణం, ప్రదోషకాల పూజ, తమలపాకులు, తెల్ల కలువలు, ఎర్ర కలువలచే పూజా కార్యక్రమాలు జరిగాయి.

గణపేశ్వరంలో అన్నపూర్ణాదేవిగా..

గణపేశ్వరం(నాగాయలంక): గణపేశ్వరం దుర్గా, గణపేశ్వరస్వామి ఆలయాలలో కనకదుర్గమ్మ మూల విరాట్‌ను బుధవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. భావదేవరపల్లిలో అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమార్చన చేశారు. ఇదే గ్రామంలోని గ్రామదేవత అంకాల దేవర దేవస్థానంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. మండలంలోని టి.కొత్తపాలెం భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అయ్యవారు, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లలితా త్రిపుర సుందరీదేవిగా..

కొక్కిలిగడ్డ(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని దుర్గా, పార్వతి సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గమ్మ అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. కొక్కిలిగడ్డలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, సువాసినీలచే సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



మహాలక్ష్మీదేవి అలంకరణలో పెడన పైడమ్మ అమ్మవారు




పెడన కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



భావదేవరపల్లిలో లలితా త్రిపుర సుందరిగా అమ్మవారు



కొక్కిలిగడ్డలో లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గామాత



గూడూరు రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు



మహాలక్ష్మీ అలంకారంలో విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ



రాజుపేట ముత్యంగుడిలో ధనలక్ష్మీదేవిగా అమ్మవారు



చల్లపల్లిలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



బంటుమిల్లి రామాలయంలో గజలక్ష్మీదేవిగా అమ్మవారు

● **గూడూరు:** గూడూరులోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్వారకా నగర్‌లోని రామాలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమివ్వగా, ఐదుగుళ్లపల్లి శివాలయంలో కాశీ అన్నపూర్ణాదేవిగా అలంకరించారు.

● **కోడూరు:** కోడూరు గంగాభవానీ అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించారు. విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారు, కోడూరు కనకదుర్గమ్మ అమ్మవార్లు మహాలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయాల్లో మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. లింగారెడ్డిపాలెం బాలా త్రిపుర సుందరీ, కోడూరు పార్వతి, దానాశక్తి, మాచవరం తుంగపల్లెమ్మ, మందపాకల నాంచారమ్మ, హరిపురం మహంకాళి, ఉల్లిపాలెం, హంసలదీవిలోని రాజ్యలక్ష్మీ అమ్మవార్లను ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనం కల్పించారు. నరసింహపురంలోని దుర్గమ్మ విగ్రహానికి ధనలక్ష్మీ అలంకారం చేశారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

మచిలీపట్నంటౌన్: బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో అమ్మవారు మీనాక్షిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పుష్పాలతో విశేషార్చన నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి నృత్య నికేతన్‌కు చెందిన కళాకారులు చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. రాబర్ట్సన్‌పేటలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం కుంకుమార్చనలు చేశారు. ఆజాద్‌రోడ్డులోని గీతామందిరంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితా త్రిపుర సుందరిదేవిగా, లలితా అమ్మవారు ధైర్యలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. కోటి కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారు మహాలక్ష్మీదేవిగా, కన్యకా పరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం లక్ష్మీ కుబేర అర్చన నిర్వహించారు. రాత్రికి పురంధరదాసు అన్నమాచార్య కీర్తనలు, ఓలేటి అరుణ సత్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే నగరంలోని రాజుపేట ముత్యంగుడిలో అమ్మవారు ధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య మహిళలు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. ఈడేపల్లి శక్తి గుడి, ప్రధాన రహదారిలోని విజయదుర్గాదేవి, రేవతి సెంటర్‌లోని గంగానమ్మగుడి, బెల్లంకొట్ల వీధిలోని మహాలక్ష్మీ అమ్మవారు, హిందూ కళాశాల వద్దనున్న సరస్వతిదేవి ఆలయాల్లో అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమార్చన చేశారు.

● **అవనిగడ్డ:** స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో బుధవారం దసరా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బతుకమ్మ పూజలు చేశారు. విద్యార్థులు నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

● **చల్లపల్లి:** స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు మహాలక్ష్మీగా దర్శనమిచ్చారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లిపర మధు, అన్నవరపు పాండురంగారావు, పెద్దలు వరదా హరిగోపాల్ ఆధ్వర్యంలో వేద పండితులచే అమ్మవారికి కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీ అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భగవద్గీత పారాయణం చేశారు. ఉదయం నగర సంకీర్తన, పల్లకీ సేవ నిర్వహించారు.

● **బంటుమిల్లి:** పెంచ్వాపురం ఆంజనేయస్వామి ఆలయంలో మహాలక్ష్మీ దేవిగాను, బంటుమిల్లి కనకదుర్గ అమ్మవారి ఆలయం, పెద తుమ్మిడి శివాలయంలో అమ్మవార్లను లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలోను, బంటుమిల్లి పద్మావతి గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని ధాన్యలక్ష్మీ దేవిగాను, సీతారామాంజనేయస్వామి ఆలయంలో అమ్మవారిని గజలక్ష్మీదేవిగాను అలంకరించి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ముంజులూరు, మల్లంపూడి, మల్లపరాజుగూడెం తదితర గ్రామాల్లో భక్తులు అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసి కుంకుమ పూజలు నిర్వహించారు.

రూ. 3 లక్షలతో అలంకరణ



మహాలక్ష్మీదేవిగా నాగాయలంక కనకదుర్గమ్మ

నాగాయలంక: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక కన్యకా పరమేశ్వరి సమన్విత పార్వతీ సమేత నగరేశ్వర స్వామి దేవస్థానం, కృష్ణానది తీరంలోని కనకదుర్గమ్మ ఆలయాలలో అమ్మవార్లు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. కన్యకాంబ ఆలయంలో పార్వతీదేవిని రూ.2 లక్షల కరెన్సీ నోట్లతో, కనకదుర్గమ్మను రూ.3 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. నిత్య కార్యక్రమాల్లో భాగంగా శ్రీచక్ర కలశ పీఠం వద్ద శ్రీదేవి సహస్రనామ కుంకుమార్చన, అష్టోత్తర శతనామార్చన పూజలు జరిగాయి. శ్రీ లలితా శ్రీలక్ష్మీ సహస్ర నామ సామూహిక పారాయణం జరిగింది.



నాగాయలంకలో కరెన్సీ నోట్ల అలంకరణలో పార్వతీదేవి

సామాజిక బస్సుయాత్రను విజయవంతం చేయండి

రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి



మాట్లాడుతున్న అయోధ్య రామిరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు పేర్ని నాని, సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేసిన మంచి పనులను గ్రామాలకు తీసుకువెళ్లేలా చేపట్టిన సామాజిక బస్సుయాత్రను విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ అయోధ్య రామిరెడ్డి కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రామిరెడ్డి మాట్లాడుతూ నవంబర్ 2వ తేదీన అవనిగడ్డలో సామాజిక బస్సుయాత్ర జరుగుతుందని చెప్పారు. అధికారంలోకి రాకముందు మేము ఏవైతే చెప్పామో నాలుగున్నరేళ్లలో వాటిని చేసి చూపించామని, వాటినే ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు బస్సుయాత్రను చేపట్టామని రామిరెడ్డి తెలిపారు. సామాజికంగా అంతరాలను తొలగించేందుకు సీఎం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఆర్థికంగా వెనుకబడిన ఓసీలకు ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంటి మంచి నాయకత్వాన్ని మరలా ఎన్నుకుని వచ్చే తరానికి గొప్పగా ఉండేలా అవనిగడ్డ నుంచి బస్సుయాత్ర ద్వారా శంఖారావం పూరిస్తామని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్‌ను తీర్చిదిద్దే విధంగా వైఎస్సార్ సీపీని ప్రజలు ఆదరించాలని రామిరెడ్డి కోరారు. సీఎం జగన్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుని గతంలో కంటే అధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలన్నారు. పేద ప్రజలను ఇంతగా పట్టించుకున్న ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేరని, మరోసారి ఆదరిస్తే ఈ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతారని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2,40,000 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రూ.12 వేల కోట్లతో 70 వేల ఎకరాలు సేకరించి పేదలకు ఉచితంగా ఇళ్లస్థలాలు ఇచ్చామని చెప్పారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలను ప్రభుత్వం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిందన్నారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ ఏటిమొగ–ఎదురుమొండి వారధి నిర్మాణానికి ఈనెల 26వ తేదీన టెండర్లు ఓపెన్ అవుతాయని చెప్పారు. త్వరలోనే అవనిగడ్డ–కోడూరు రహదారిని నిర్మిస్తామన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు చిల్లపల్లి మోహనరావు, ఆరు మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి

పేర్ని కిట్టు



వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: పేద ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 46వ డివిజన్‌లోని ఈడేపల్లి ప్రాంతంలో పేర్ని కిట్టు బుధవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అన్నివర్గాలకు మేలు చేసేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మరోసారి సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భోగాది సాయిబాబు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, కార్పొరేటర్లు పరింకాయల విజయకుమార్, జోగి చిరంజీవి, రాసంశెట్టి వాణిశ్రీ, పల్లి శేఖర్, నాయకులు పాల్గొన్నారు. తొలుత ఈడేపల్లి శక్తిగుడిలో, సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేశారు.

క్రిస్టియన్ మైనార్టీ విభాగం బలోపేతానికి కృషి

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం కృష్ణా జిల్లా శాఖను మరింత బలోపేతం చేస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు అన్నారు. నగరంలో బుధవారం ఆ విభాగం జిల్లా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్‌ను మరింత బలోపేతం చేసేందుకు గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు తమ విభాగం మరింత కృషి చేస్తోందని తెలిపారు. మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) చొరవతో కమిటీలను నియమిస్తామన్నారు. క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, క్రిస్టియన్ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి కేజే విక్టర్‌పాల్, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మద్దెల పాండురంగారావు, బందెల థామస్ నోబుల్, కలపాల అనుపమ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి హైదరాబాద్, విశాఖకు ప్రత్యేక బస్సులు

మచిలీపట్నంటౌన్: దసరా సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు మచిలీపట్నం నుంచి హైదరాబాద్, విశాఖపట్నం నగరాలకు అదనంగా ప్రత్యేక బస్సులు నడుపుతామని ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నానికి 18 నుంచి 22వ తేదీ వరకు ప్రతి రోజు రాత్రి సాధారణ చార్జీతో ప్రత్యేక బస్సు నడుపుతామన్నారు. ఈ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం ఉందని చెప్పారు. రాను, పోనూ ప్రయాణానికి ఒకేసారి టిక్కెట్ రిజర్వేషన్ చేయించుకుంటే టిక్కెట్ చార్జీలో 10 శాతం రాయితీ ఇస్తామని తెలిపారు.

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కాలేఖాన్‌పేటలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. 30, 38 డివిజన్లలో బుధవారం సురక్ష శిబిరాలు నిర్వహించారు. 30వ డివిజన్ కాలేఖాన్‌పేట నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల, 38వ డివిజన్ వారికి వర్రెగూడెంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్లు మిరియాల బసవపూర్ణమ్మ, రాసంశెట్టి వాణిశ్రీ, వైఎస్సార్ సీపీ 38వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాకోళపు నరసింహగుప్తా, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, కార్పొరేటర్ మిరియాల బసవపూర్ణమ్మ పాల్గొన్నారు.

నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు

పెడన: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలను చేరువ చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మడక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బుధవారం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీపీ రాజులపాటి వాణితో కలిసి రాజీవ్ ప్రారంభించి మాట్లాడారు. 376 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వీరిలో ఆరుగురిని వివిధ శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అచ్యుతరావు, వెంకట రామానాయుడు, నాగబాబు, జోగి శ్రీనివాసరావు, దావు భైరవలింగం, ఎంపీడీఓ రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం గూడూరులో వైద్యశిబిరం నిర్వహించారు. మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 622 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మచిలీపట్నం, గూడూరు ఆస్పత్రుల వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరాన్ని మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, ఎంపిపి సంగా మధుసూదనరావు ప్రారంభించారు. సర్పంచి లింగం సులోచనారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు గోరిపర్తి రవికుమార్, పర్లం మహాలక్ష్మయ్యనాయుడు, మోటేపల్లి రత్నారావు, ఫైజుల్ రహ్మాన్, కనపర్తిరాజు పాల్గొన్నారు.

కార్పొరేట్ వైద్యం..

అవనిగడ్డ: ప్రతి పేదవానికి కార్పొరేట్ వైద్యసేవలు అందించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక పంచాయతీ పరిధిలోని కొత్తపేటలో బుధవారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. శిబిరాల ద్వారా గ్రామాలకు వైద్యులు వెళ్లి కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నారని వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెడన: ఆంధ్రప్రదేశ్ గురుకుల కళాశాల నిమ్మకూరులో 2023–24 విద్యా సంవత్సరానికి ఫుల్ టైమ్ గెస్ట్ పద్ధతిన ఫిజికల్ ఎడ్యుకేషన్(పీడీ) బాధ్యతల నిర్వహణకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రధానాచార్యులు టి. అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల మెరిట్‌ను అనుసరించి నియామకం చేపడతామని చెప్పారు. సంబంధిత దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కళాశాలలో సమర్పించాలన్నారు. వచ్చిన దరఖాస్తులను కమిటీ వారి పరిశీలన అనంతరం నియామకం ఖరారు చేస్తామని వివరించారు.

వృద్ధులకు అండగా చట్టాలు

బంటుమిల్లి: కుటుంబ సభ్యుల నిరాదరణకు గురవుతున్న వృద్ధులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు చట్టాలను రూపొందించాయని విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వి.కామరాజు అన్నారు. బుధవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. కామరాజు మాట్లాడుతూ వృద్ధులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బంటుమిల్లి కృత్తివెన్ను మండలాల పరిధిలోని పలువురు సీనియర్ సంఘ సభ్యులను ఘనంగా సత్కరించారు. సంఘ అధ్యక్షుడు సీహెచ్ గంగాజలరావు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌లో నిర్వహిస్తున్న ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పరిశీలన కార్యక్రమం బుధవారం కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ రాజాబాబు తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో భాగంగానే మచిలీపట్నంలో ఈ పరిశీలన ప్రక్రియ జరుగుతోందన్నారు. బ్యాలెట్ యూనిట్లు 5,600, కంట్రోల్ యూనిట్లు 4,361, వీవీ ప్యాట్లు 5,232 జిల్లాకు వచ్చాయని, వీటి పనితీరును తనిఖీ చేస్తున్నామని వివరించారు. డీపీఓ నాగేశ్వరనాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సురేష్, డీటీ శ్యామ్‌నాథ్ పాల్గొన్నారు.

కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలు కోసం జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సభ్యుల నియామకానికి అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ షాహీద్‌బాబు బుధవారం తెలిపారు. నాన్ అఫీషియల్ సభ్యులుగా చేరేందుకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు వారి పూర్తి బయోడేటాతో దరఖాస్తులను ఈ నెల 21వ తేదీలోగా కలెక్టరేట్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.